
"అర్హత...

ఇది లేని మనిషి ఆకాశానికి ఎదిగినా ఏదో ఒకనాడు తప్పక కిందపడతాడు. అర్హత వున్న వాడు అట్టడుగునున్నా... ఏనాటికైనా... ఆకాశ మంతెత్తుకు ఎదుగుతాడు."

"ఏమండీ... ఈ రోజు రాత్రికేనా మీ హైదరాబాద్ ప్రయాణం?" అంది కమల గుర్తుచేస్తున్నట్లుగా.

"అవును... ఏం?" అన్నాను పేపర్లో నుంచి తల పక్కకు పెట్టి.

"నేను చెప్పిన సంగతి గుర్తుంది కదూ? లేదా నన్నే మీతో కూడా వచ్చి మాట్లాడ మంటారా?" అంది కాఫీగ్లాసందిస్తూ కోపంగా.



# ఆర్ద్రత

"ఏసంగతి?" ఏమీ తెలియనట్లు... తన నోటితో మళ్లీ వినాలని అడిగాను అమాయకంగా.

"అబ్బా ఎంత మరుపండీ మీకు! ఇది మతిమరుపేనా లేక...?" అంది నావైపు సూటిగా చూస్తూ...

"ఏదో ఒకటిలేవోయ్ ముందు అసలు సంగతి చెప్పు?" అన్నాను. పరిస్థితి విషమించబోతోందని అర్థమై.

"అదేనండీ...! మనబ్బాయి సంగతి. వాడి సీటు గురించి. మీ చిన్ననాటి మిత్రుడూ... కార్మికశాఖ మంత్రి అయిన కోటేశ్వరరావన్నయ్యని కలిసి అడుగుతానన్నారే... అది..." అంది తాపీగా కూర్చుంటూ.

"నేను అడుగుతానన్నానా?" అని అడగాలనిపించింది... కానీ ధైర్యం చాల్లేదు.

నా భార్య కమలని చూస్తే ఒక్కోసారి జాలీ... కోపం... మరోసారి అయిష్టత... అన్నీ కలుగుతాయి నాకు.

నాతో ముప్ఫైఏళ్ల నుంచి కాపురం చేసినా నన్ను ఇప్పటికీ అర్థంచేసుకోలేకపోయింది తను. ఇక ఎప్పటికీ అర్థం చేసుకోలేదేమో అని కూడా అనిపిస్తుంది.

ఆరోజు రాత్రి రైలుకు హైదరాబాదుకు వెళ్లాల్సివుండడంతో... నాక్కావాల్సిన మందులు... వగైరా సిద్ధంచేసుకోవాలని బజారుకు బయలుదేరాను.

నా మిత్రుడూ... కార్మికశాఖా మంత్రి అయిన కోటేశ్వరరావు తన కుమారుడి వివాహానికి నన్ను గుర్తుంచుకుని మరీ ఆహ్వానించాడు.

కోటేశ్వరరావు, నేను ఇద్దరం దాదాపు ముప్ఫై సంవత్సరాల క్రితం చీరాలలో ఒకే స్కూలులో ఉపాధ్యాయులుగా జీవితాన్ని ప్రారంభించాం. అతను యూనియన్లతో తిరుగుతూ కాస్త పేరు సంపాదించుకుని, ఉద్యోగానికి రాజీనామాచేసి, రాజకీయాల్లో చేరాడు. నేను మాత్రం అలా ఉపాధ్యాయుడిగానే కొనసాగిపోయాను.

వాడు అంచెలంచెలుగా ఎదుగుతూ... నేడు కార్మికశాఖా మంత్రైపోయాడు.

ఇన్ని సంవత్సరాలలో మేము వీలున్నప్పుడల్లా కలుసుకుంటూనే ఉండేవాళ్లం. కష్టసుఖాలు పంచుకుంటూనే వుండేవాళ్లం. కలుసుకోలేని పరిస్థితులలో ఉత్తరాలలో... ఫోన్లలో పలకరించుకుంటూ వుండేవాళ్లం.

వాడి హోదా ఎంతెత్తుకు ఎదిగినా... మేము మాత్రం ఏరా... అంటే ఏరా... అని ఆప్యాయంగా సంబోధించుకునేవాళ్లం.

మా ఇళ్లల్లో ఏ శుభకార్యమైనా వీలుంటే కుటుంబసమేతంగా... లేనిపక్షంలో ఎవరైనా మా ఇద్దరిలో ఒకరయినా హాజరయ్యేవాళ్లం.

నా భార్యకు కాస్త ఒంట్లో నలతగా వుండడంతో... ఈసారి నేను వంటరిగానే వెళ్లాలని

ఎస్. శేషగిరి

నిర్ణయించుకున్నాను.

రోడ్డుమీద నడుస్తున్న నాకు... 'నమస్కారం మాష్టారూ' అని వినబడగానే ఆ గొంతు విన్నదే అనుకుంటూ వెనక్కి తిరిగి చూసాను.

"ఏంటి మాష్టారూ ఎండలో బయలుదేరారు?" అన్నాడు సుబ్బయ్య.

సుబ్బయ్య మా ఊర్లో చిన్న వ్యాపారం ప్రారంభించి, విపరీతంగా పరిశ్రమించి మా వూరికే పెద్ద అంగడి పెట్టగలిగాడు అనతి కాలంలోనే. అందుకే అతనంటే నాకు గౌరవం.

'ఏంలేదు సుబ్బయ్యా. కాస్త బజారెల్దామని బయలుదేరాను. రాత్రికి హైదరాబాద్ వెళ్లాలి. నా మిత్రుడు లేడూ... కార్మికశాఖ మంత్రి... వాడి కొడుకు పెళ్లి రేపు. అందుకే ప్రయాణానికి కావలసిన సరంజామా... పెళ్లికి పెట్టాల్సిన కట్నాలు కానుకలు కొనాలని బయలుదేరాను'.

'ఆ... ఇంకా ఏంటి విశేషాలు సుబ్బయ్యా? కూతురూ, అల్లుడూ కులాసేనా? ఏం చేస్తున్నారు అల్లుడుగారు?' అని అడిగాను.

'ఆ... అంతా బావున్నారండీ. అల్లుడుగారు కాంట్రాక్టరండీ... ఏవో చిన్న చిన్న కాంట్రాక్టులు చేస్తూవుంటాడండీ...' అన్నాడు.

'అవునూ! మొన్న మన ఊళ్లో రోడ్డేసింది అతనే కదూ?' అన్నాను. వేసిన నాలుగు నెలలకే కంకర తేలడం గుర్తొచ్చి.

'అవునండీ మాష్టారూ... చాలా బాగా గుర్తుపట్టారే! ఎంతైనా మీరు బడిపంతులు కదా. మీకు జ్ఞాపకశక్తి ఎక్కువే' అన్నాడు చిన్నగా నవ్వుతూ.

'సరే మళ్లీ కలుస్తాను సుబ్బయ్యా...' అని అడుగు ముందుకువేయబోతుండగా... అతను ఆపాడు.

'ఏంటి సుబ్బయ్యా?' అన్నాను.

'అయ్యా... మీతో చిన్నపని...' అంటూ నసిగాడు.

'ఏం పనో చెప్పు? ఎందుకలా నాన్చుతావు? చెప్పు. నావల్ల అయితే తప్పక చేస్తాను' అన్నాను అతని భుజంమీద చెయ్యివేసి భరోసా ఇస్తూ...

'అదీ... అదీ... ఈ మధ్య మనవూర్లో బ్రిడ్జి కట్టడానికి టెండర్లు వేసారు కదా మాష్టారూ... అందులో మా అల్లుడూ టెండరేసాడు... మీరు కాస్త దయతలచీ... మీ మిత్రుడికి చెప్పి... ఎలాగైనా ఆ కాంట్రాక్టు మా అల్లుడికి వచ్చేట్లు

## డూప్లికేట్‌కి ఫస్ట్ - ఒరిజినల్‌కి థర్డ్

చార్లీచాప్లిన్‌ని అభిమానించనివారంటూ వుండరు. ఓసారి చార్లీ చాప్లిన్‌కి సంబంధించి ఓ చిత్రమైన పోటీ జరిగింది. చాప్లిన్ అభిమానుల కోసం ఏర్పాటైన కార్యక్రమం ఇది.

చాప్లిన్ వేషధారణ, నడక, నటనను అనుకరిస్తూ స్టేజిపై ఒక్కొక్కరూ ఐదేసి నిమిషాలు అభినయించి చూపాలి. ఆ పోటీలో చార్లీచాప్లిన్ అభిమానులయిన మిమిక్రీ కళాకారులు ఎంతోమంది పాల్గొన్నారు. ఈ విషయం తెలిసిన చాప్లిన్ కూడా సరదాగా తన వేషధారణతో పాల్గొన్నాడు.

కార్యక్రమం ముగిసింది. జడ్జీలు ఫలితాలు ప్రకటించారు. చాప్లిన్‌కి మూడవ బహుమతి లభించింది ఆ పోటీలో. అదీ కొసమెరుపు.

చెయ్యాలనీ... నా మనవి' అంటూ ఆగాడు నేలచూపులు చూస్తూ...

నాకు అతనిపై కోపమొచ్చినా... నన్ను నేను సముదాయించుకుని, 'చూడు సుబ్బయ్యా... నీకు నా గురించి, నా పద్ధతుల గురించీ బాగా తెలుసుకదా? నేనీపని ఎలా చేస్తానని అనుకున్నావు?' అన్నాను సూటిగా అతని కళ్లలోకి చూస్తూ.

కమీషన్లు ఇచ్చీ... లంచాలుపెట్టీ... రెకమెండేషన్లుపెట్టి... కాంట్రాక్టు సంపాదించిన వ్యక్తి బ్రిడ్జిలేం కట్టగలడు? కట్టినా అవి ఎంత కాలం నిలువగలవు?

'నో... ఇతనికి ఆ కాంట్రాక్టు సంపాదించే అర్హత ఏమాత్రం లేదు' అని నాలో నేను అనుకుంటూ ముందుకు నడిచాను.

అలా నడుస్తుండగా... దారిలో శ్రీధర్ ఎదురయ్యాడు. అతను నా శిష్యుడు అని చెప్పుకునేందుకు గర్వపడ్తా నేను.

'నమస్కారం మాష్టారూ, బావున్నారా?' అంటూ సైకిలాపి నిల్చున్నాడు

నాకెందుకో అతన్ని చూస్తే జాలేసింది. ఆ జాలితోపాటే ఒకరకమైన ప్రేమ... గౌరవం కూడా కలుగుతుంది. శ్రీధర్ కూడా నా కొడుకు వయసువాడే. అతని తల్లిదండ్రులు కూలివారైనా, వాళ్లకు ఇతన్ని చదివించే స్తోమత లేకపోయినా... వాళ్లమీద ఏనాడూ కోపం తెచ్చుకోకుండా... చదువుపై ఆసక్తి చంపుకోకుండా... పొద్దున్నే పాలుపోసి, పేపరేసి బడికొచ్చేవాడు. శ్రద్ధగా చదువుకునేవాడు.

రాత్రనక పగలనక కష్టపడి చదివి, మా వూర్లోనే ఫస్ట్ర్యాంక్ వచ్చాడు పదోతరగతిలో. తరువాత గవర్నమెంట్ స్కాలర్‌షిప్‌తో ఇంటర్, డిగ్రీ పాసయ్యాడు.

రాని ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా, కాలాన్ని వృధాచేయకుండా... తన స్వశక్తిని నమ్ముకుని చిన్నగా కూరగాయల వ్యాపారం ప్రారంభించాడు. దాంతో అతను తనను తాను పోషించుకోవడమే కాకుండా తనవాళ్లనూ పోషించుకుంటున్నాడు.

రోజూ ఉదయం పేపరువేసి, పాలుపోసి, మార్కెట్‌కెళ్లి కూరగాయలేసుకుని సాయంత్రాని కల్లా అమ్ముకునేవాడు.

'అలా ఎంతకాలం తిరుగుతావురా? ఏదైనా చిన్న షాపులాంటిది తీసుకుని వారానికి కావాల్సిన కూరలు తెచ్చుకోవచ్చుగా' అన్నాను ఓ రోజు.

'నాకూ అదే కోరిక మాష్టారూ. కానీ అందుకు డబ్బుకావాలిగా? వచ్చినదాంట్లో లాభం ఏరోజుకారోజు ఇల్లు గడవడానికే బొటాబొటీగా సరిపోతోంది. మరి షాపంటే అడ్వాన్సనీ... అద్దనీ... కరెంటు... ఫర్నిచర్... అదీ... ఇదీ... ఎంతకాదన్నా కనీసం యాభైవేలకు పైమాటే. నాలాంటి వాడికి యాభైవేలంటే ఎలావస్తాయి మాష్టారూ?' అన్నాడు నెమ్మదిగా.

'పోనీ... ఏదైనా ప్రభుత్వ పథకంలో లోన్ తీసుకోకపోయావా?' అన్నాను.

'ఊరుకోండి మాష్టారూ... నాకెవరిస్తారు లోన్? ఏంచూసి ఇస్తారు? దానికి బోలెడు రూల్సు... రెగ్యులేషన్స్... అన్నిటికీ మించి రెకమెండేషన్సు కావాలి. అవేవీ నా దగ్గర లేవు. ఏదో నాకున్నంతలో ఇలా నడిపేస్తున్నాను' అన్నాడు నిరాశగా శ్రీధర్.

నేను వెంటనే వాడిచేత బలవంతాన లోన్‌కి దరఖాస్తు చేయించాను ఆరోజే. ఎలాగైనా

వాడికి సహాయం చేయాలనే సంకల్పంతో.

రైలుకు ఇంకా గంటన్నర టైమ్ వుందనగా నేను నా లగేజి తీసుకుని బయలుదేరబోతూంటే... 'ఏమండీ... గుర్తుందిగా?' అంటూ మళ్లీ గుర్తుచేసింది కమల.

'చూడు కమలా... నీకు నా సంగతి బాగా తెలుసుకదా? నేనింతవరకూ...' అని అనగానే... తను కల్పించుకుని -

'పుట్టిబుద్దెరిగినప్పటినుంచీ ఎవ్వరినీ ఏదీ అడగలేదు... నేనే నాకు చాతనైనంత సాయం నలుగురికీ చేసాను తప్ప, ఇప్పుడూ కూడా నేను ఎవర్నీ అడగనూ... వాడి చావు వాడు చస్తాడూ అని అంటారు' అంతేగా? అంది ఆవేశంగా ఊగిపోతూ...

'అవును కమలా. నన్ను ఇన్నాళ్లకు కరెక్టుగా అర్థంచేసుకున్నావు. చూడు కమలా... ఎవరికైనా ఏదైనా అందాలంటే... వారికి దానిని అందుకునేందుకు అర్హత వుండాలి. ముందు దాన్ని సంపాదించమను వాడ్ని. తరువాత సంగతి తరువాత చూద్దాం' అన్నాను బయటకు నడుస్తూ.

'అంటే ఏంటండీ... మీ ఉద్దేశ్యం? కొడుకు కష్టపడి ఎంసెట్ పాసైతే వాడికి గవర్నమెంట్ కాలేజీలో చదివే అర్హత లేదా?' అని అడిగింది కోపంగా.

'అవును చాలా కష్టపడ్డాడు నీ కొడుకు... రాత్రంతా సినిమాలకు, షికార్లకూ తిరిగీ తిరిగీ ఇరవై వేలకు పైగా ర్యాంకు తెచ్చుకున్నాడు. చాలా కష్టపడ్డాడు...' అన్నాను ఈసారి ఒత్తి పలుకుతూ... కోపం పట్టలేక.

'ఎంతైనా వాడు మనబ్బాయండీ, వాడిమీద మీకు జాలి లేదా?' అంది ఏడుపుగొంతుతో.

'జాలి వుండబట్టే కదా కమలా... మూడుసార్లు ముప్పైవేలకు పైగా ర్యాంకు వచ్చినా... 'నాన్నా మళ్లీ రాస్తాను' అన్నప్పుడల్లా వేలకు వేలు పోసి కోచింగ్‌లకు పంపించి మరీ చదివించాను. జాలి వుండబట్టే కదా వాడు పదో తరగతి మూడుసార్లు ఫెయిలయినా మళ్లీ చదివించింది. జాలి వుండబట్టే వాడు పద్దెనిమిదో ఏటనే సిగరెట్లు కాలుస్తున్నాడని తెలిసినా... చావగొట్టి ఇంట్లోనుంచి గెంటకుండా చూసి వూరుకున్నాను'.


'చూడు కమలా, వాడ్ని కావాలంటే మరోసారి రాసి మంచి ర్యాంకు తెచ్చుకోమను. లేదా వాడ్ని జీవితాంతం ఇంట్లో కూర్చోబెట్టి తిండి పెడతాను. అదీ కాకపోతే అప్పో సప్పో చేసి ప్రైవేటు కాలేజీలో చేర్పిస్తాను. అంతేకానీ కష్టపడి చదివి, మంచిర్యాంకు తెచ్చుకుని, గవర్నమెంట్ కాలేజీలో చదివే అర్హతున్న మరో విద్యార్థి జీవితాన్ని నాశనం వీడికోసం చేయలేను'. ఇక ఈ విషయంలో ఇదే తుది నిర్ణయమన్నట్లు గుమ్మం బయటకు కదిలాడు నరసింహారావు.

* * *

'ఒరేయ్ నరసింహం, ఎలా ఉన్నావురా?' అంటూ సాదరంగా ఆహ్వానించాడు కోటేశ్వరరావు ఇంట్లో కాలు మోపగానే.

మా కుశలప్రశ్నలయ్యాక... నా గురించీ, కుటుంబాన్ని గురించీ అడిగాడు. నేనన్నీ వివరంగా చెప్పాను.

పెళ్లి అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రి, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులూ విచ్చేసారు. అందరికీ పేరుపేరునా నన్ను పరిచయం చేసాడు. నా ఆనందానికి అవధులు లేవు. ఆ ఆనందాన్ని మనసులో నింపుకుని... ఆ రాత్రికి బయలుదేరడానికి సిద్ధమవుతూండగా, 'నాలుగురోజులుండరా... అస్సలు మాట్లాడినట్లులేదు' అనడంతో,



వాడిమాట కాదనలేక 'అలాగే' అన్నాను.

మూడు రోజుల తర్వాత వాళ్లింట్లో హడా విడి కాస్త తగ్గడంతో మా ఇద్దరికీ తీరిగ్గా మాట్లాడుకునే వీలు కుదిరింది.

'ఒరేయ్ కోటేశ్వర్రావూ... నాకో చిన్న సాయం చెయ్యాలిరా' అన్నాను నెమ్మదిగా.

'చెప్పరా ఏంటో? అంత సందేహిస్తా వెందుకు? మీ అబ్బాయికి గవర్నమెంట్ కాలేజీ లో సీటు ఇప్పించాలా? లేక మీ అల్లుడికి ట్రాన్స్ ఫర్ చేయించాలా నీ దగ్గరకు?'...

'ఇంతవరకూ ఏదీ నోరుతెరిచి అడగని నువ్వు ఇవాళ మొట్టమొదటిసారిగా అడిగావు. అది ఏదైనా సరే తప్పకుండా తీరుస్తాను' అని అప్యాయంగా భుజంమీద చెయ్యేసి దగ్గరకు తీసుకుని భరోసా ఇచ్చాడు.

వాడి అప్యాయతకు నాలో ఆనందం పొంగి పొర్లింది.

'అవేమీ వద్దురా. శ్రీధర్ అని మా ఊర్లో వున్నాడు. ఒకప్పుడు నా శిష్యుడు...' అంటూ నాలుగు ముక్కల్లో అతని గురించి, అతని పరిస్థితి గురించీ వివరించాను.

కోటేశ్వరరావు నావంక ఆశ్చర్యంగా చూసాడు.

'నువ్వు నోరుతెరిచి ఇది కావాలీ అన్నప్పుడే గ్రహించలేకపోయానురా. నువ్వు అర్హతలేని వాడిని అందలమెక్కించాలని చూడవని. స్వంత కొడుకునీ... అల్లుడినీ... కాదని, మరో వ్యక్తి కోసం నువ్వు ఆలోచించడం... నాకు చాలా గర్వంగా వుందిరా. అయాం ప్రౌడాఫ్ యూ... మై ఫ్రెండ్... రియల్లీ అయాం ప్రౌడాఫ్‌యూ...' అని గట్టిగా నన్ను కౌగలించుకున్నాడు సంతోషంగా.

వెంటనే ఫోనందుకుని, మావూరి కలెక్టర్‌కి శ్రీధర్ వివరాలందించాడు కోటేశ్వరరావు.

నేను ఆనందంతో వాడికి చేతులు జోడించి... సెలవు తీసుకుని వెనుదిరిగాను. ●